సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 30 । నవంబర్ । 2024



విశ్వేశ్వరస్వామికి విరాళం

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో కొలువైన విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామికి ఆలయ చైర్మన్ మంచాల సత్యనారాయణ రూ.1,00,116 విరాళంగా అందజేశారు.




ఉమ్మడి.. ఆపై హడావుడి

పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే నిర్వహించడంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవకాశాలు చేజారాయి.

8లో

17 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి డెల్టా కాలువలకు 4,200 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఉల్లాసంగా కార్తిక వన సమారాధన



డీపీఓ శాంతాలక్ష్మిని సత్కరిస్తున్న కార్యదర్శుల సంఘ సభ్యులు

అమలాపురం రూరల్: అమలాపురం కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయంలో జిల్లా పంచాయతీరాజ్ ఉద్యోగుల కార్తిక వన సమారాధన శుక్రవారం జరిగింది. దీనికి డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, అటెండర్లు, పార్ట్ టైం, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇతర గ్రామ పంచాయతీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీరాజ్ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలసి ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా డీపీఓ డి.శాంతాలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి మదనమోహనరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీవిశ్వేశ్వరరావు, అమలాపురం డీఎల్‌పీఓ బొజ్జిరాజు, రామచంద్రపురం డీఎల్‌పీఓ రాజు హాజరయ్యారు. డీపీఓ శాంతాలక్ష్మి మాట్లాడుతూ వన సమారాధనలతో అధికారులు, ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక వాతావరణం వెల్లివిరిస్తుందన్నారు. డీపీఓను జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు, ఎస్ఎస్ సూరపరాజు, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సాయిరామ్ సత్కరించారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



పోలీసుల సమక్షంలో పుష్పవతికి బ్యాగ్ అప్పగిస్తున్న ఆటో డ్రైవర్ శివన్నారాయణ

రావులపాలెం: ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు.. సుమారు రూ.ఐదు లక్షల బంగారు ఆభరణాలున్న బ్యాగ్‌ను ఓ మహిళ ఆటోలో మర్చిపోతే దానిని తిరిగి అప్పగించి అందరి మన్ననలు పొందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామానికి చెందిన మానేపల్లి పుష్పవతి బంధువుల ఇంటికి వెళుతూ ఆటో ఎక్కి రావులపాలెంలో దిగిపోయింది. ఈ నేపథ్యంలో ఆమె బ్యాగ్‌ను ఆటోలోనే మర్చిపోయింది. ఆటోలో బ్యాగును గుర్తించిన ఆత్రేయపురం మండలం అంకంపాలేనికి చెందిన ఆటో డ్రైవర్ మండెలా శివన్నారాయణ రావులపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇచ్చాడు. ఆ బ్యాగ్‌లో సుమారు రూ. 5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సదరు మహిళ పుష్పవతి అడ్రస్ గుర్తించి ఆమెకు బ్యాగ్‌ను ఎస్సై చంటి సమక్షంలో అప్పగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: న్యూ ఢిల్లీ మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎంపవర్‌మెంట్ పౌర హక్కుల రక్షణ చట్టం, అత్యాచారాల నిరోధక చట్టం ద్వారా బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు నేషనల్ హెల్ప్ లైన్ ఎగనెస్ట్ అట్రాసిటీస్ ఆవిష్కరణ సందర్భంగా కౌన్సిలర్లను నియమించనున్నారు. దీనికి గాను విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికారత అధికారి ఎం.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. క్షేత్ర స్థాయిలో దళిత సమస్యలపై అవగాహన ఉన్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు డిసెంబర్ 7వ తేదీ లోపు అన్ని వివరాలతో దరఖాస్తు చేయాలన్నారు. దీనిని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో అందించాలన్నారు.

ఎల్.గన్నవరంలో ఇసుక అక్రమ తవ్వకాలు

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో పాత అక్విడెక్టు దిగువన శుక్రవారం ఇసుక అక్రమ తవ్వకాలు ప్రారంభించారు. నిబంధనలకు విరుద్ధంగా పడవలపై ఇసుక తరలిస్తున్నారు. రెండు బోట్ల సాయంతో ఇసుక తీస్తున్నారు. ఈ ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉండడంతో పడవలపై ఇసుక తీయడానికి అనుమతి లేదు. ఆ నిబంధనలను ఉల్లంఘించి అక్రమార్కులు ఇసుక తీస్తున్నారు. అలాగే అక్విడెక్టుకు 500 మీటర్ల దూరం లోపు ఇసుక తవ్వకూడదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



అలమూరు-3 సచివాలయం పరిధిలో అసంపూర్తి భవనాల్లో గేదెలు



గుమ్మిలేరులో నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలు

పురోగతి లేకుండా..

- నిలిచిన ప్రభుత్వ భవన నిర్మాణాలు
- గత ప్రభుత్వంలో వేగంగా.. ఇప్పుడు నిర్లక్ష్యంగా..
- వడకేసిన పల్లెల ప్రగతి
- ప్రజా పాలనకు గ్రహణం

అలమూరు: పల్లె ప్రగతి కుంటుపడుతోంది.. కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవలను దూరం చేస్తోంది.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యంగా మార్చుతోంది. దీంతో గ్రామీణ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నెలల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి దాపురిస్తోంది. గతంలో గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసి గ్రామీణ, పట్టణ ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను అందించింది. అలాగే మండల, జిల్లా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన అవసరం లేకుండా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం సుమారు రూ.450 కోట్లు వెచ్చించి ఊరూరా ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం చేపట్టింది. నిధుల కొరతకు ఏమాత్రం అవకాశం లేకుండా దశల వారీగా సుమారు 70 శాతం భవన నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. మిగిలిన భవనాలను ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులకు బ్రేక్ పడింది. అయితే తుది దశకు చేరుకున్న భవనాల పట్ల కూడా ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఇంకా ప్రారంభానికి నోచుకోకుండా పోయాయి. దీంతో అరకొర వసతులున్న భవనాల్లోనే వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఉన్న ద్వేషంతోనే గ్రామీణ, వార్డు సచివాలయాల పరిధిలో భవనాలను పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ నిర్మించిన ప్రభుత్వ భవనాలకు పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పూర్తయిన పనుల వరకూ బిల్లులు చెల్లించినా మిగతా పనులు వేగంగా జరిగేవని అంతా అంటున్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామీణ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన జరిగింది. అప్పటి వరకూ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కేవలం కార్యదర్శి, బిల్ కలెక్టర్, అటెండర్ మాత్రమే ఉండేవారు. సాధారణ వ్యక్తికి ఏ విధమైన ధ్రువపత్రం కావాలన్నా వ్యయ ప్రయాసలకోర్చి మండల కార్యాలయాలకు వెళ్లి అక్కడ గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రజల ఇబ్బందులను గమనించి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందించే విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. ఒక్కో గ్రామ సచివాలయంలో 11 నుంచి 14 శాఖల వరకూ ఉద్యోగులను నియమించారు. 35 ప్రభుత్వ శాఖలకు చెందిన 550 సేవలకు పైగా అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సేవలను అందించాలన్న ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా జిల్లాలోని 385 పంచాయతీ పరిధిలో 515 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ పరిధిలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ తదితర ప్రభుత్వ భవనాలను నిర్మించేందుకు ఒక్కో భవనానికి రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల చొప్పున సుమారు రూ.350 కోట్లు మంజూరు చేశారు. ఆ మేరకు భవన నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి లేకుండా పోయింది.



ఉప్పలగుప్తంలో తుది దశలో నిలిచిపోయిన హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే భవనాలు

ప్రభుత్వ భవనాలు	మంజూరు	పూర్తయినవి	నిలిచిపోయిన భవనాలు
రైతు భరోసా కేంద్రాలు	384	317	67
హెల్త్ క్లినిక్‌లు	329	251	78
సచివాలయాలు	458	361	97

ఎక్కడి పనులు అక్కడే..

జిల్లాలోని 515 గ్రామ సచివాలయాలకు సంబంధించి తొలి విడతగా 1,171 ప్రభుత్వ భవనాలు మంజూరయ్యాయి. ఇందులో అప్పటికే భవన నిర్మాణాలు శరవేగంగా ముందుకు సాగడంతో అనేక భవనాలు నిర్మాణాలను పూర్తి చేసుకోగా, మిగిలిన భవనాలు తుది దశకు చేరుకున్నాయి. మరికొన్ని భవనాలు పునాది దశలోనే నిలిచిపోయాయి. జిల్లాలో ఇప్పటి వరకూ 384 గ్రామ సచివాలయాలకు గాను 317లు, 384 ఆర్‌బీకేలకు గాను 251లు, 329 హెల్త్ క్లినిక్‌లకు గాను 361 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన నిర్మాణాలు పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. త్వరితగతిన వీటిని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడం ద్వారా మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి



గ్రామంలో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సత్వరమే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఇప్పటికీ గుమ్మిలేరులో కేవలం గ్రామ సచివాలయం భవనం పూర్తికాగా, మిగిలిన భవనాలు వివిధ దశలో ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి.

– గుణ్ణం రాంబాబు, సర్పంచ్, గుమ్మిలేరు

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



జిల్లా వ్యాప్తంగా అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలను దశల వారీగా పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలి. గత ప్రభుత్వం మాదిరిగా గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ భవనాలను నిర్మించడం ద్వారా ప్రజా పాలనను మరింత మెరుగ్గా అందించే వీలు కలుగుతుంది.


– తోరాటి సీతామహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు, ఆలమూరు

సమస్త సేవలకు కేంద్రంగా..

సచివాలయ కార్యాలయాల ఏర్పాటుతో పాటు ఉద్యోగులను నియమించి అనేక సేవలను ప్రజలకు అందించడంతో పాటు ధ్రువపత్రాలన్నీ క్షణాల్లో మంజూరు చేసే వీలు కల్పించారు. అన్నదాతల అవస్థలకు చెక్‌పెడుతూ సాగులో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ రైతు భరోసా కేంద్రాలను తీసుకు వచ్చారు. విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకూ రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామీణ రైతులకు అందాయి. అర్హులందరికీ విత్తనాలు, ఎరువులతో పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు తదితరాలు అందించడంలో కీలకపాత్ర పోషించాయి. ఇదిలా ఉంటే గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతులతో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం గత ప్రభుత్వం చేపట్టింది. వైద్య ఆరోగ్య సిబ్బందికి బస ఏర్పాటు చేయడంతో పాటు అధునాతన పరికరాలను మంజూరు చేసి అత్యుత్తమ వైద్య సేవలను గ్రామాల్లోనే అందించే పరిస్థితి కల్పించింది. నెలకు రెండు రోజులు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు హెల్త్ క్లినిక్‌లకు వచ్చి నాణ్యమైన వైద్య సేవలను అందించే పరిస్థితి ఉండేది.

ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి

- నేటి నుంచి బేసిక్ ట్రైనింగ్
- పూర్తయిన మెడికల్ ఫిట్‌నెస్ ప్రక్రియ



అమలాపురం టౌన్: సీనియారిటీ ప్రాతిపదికగా జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 22 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి లభించింది. ఏలూరు రేంజ్ పరిధిలో మొత్తం 137 మంది ఏఎస్సైలు పదోన్నతి పొందుతున్నారు. జిల్లాలో ఏఎస్సైలకు పదోన్నతి విషయాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయం ధ్రువీకరించింది. వీరికి తిరుపతి సమీపంలోని కళ్యాణ్ డ్యామ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆరు వారాల పాటు బేసిక్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. దీనికోసం జిల్లాలో ఆ 22 మంది ఏఎస్సైలకు గురు, శుక్రవారాల్లో మెడికల్ ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తయ్యింది. వీరు ఏలూరు రేంజ్ కార్యాలయంలో రిపోర్టు చేసి అక్కడి నుంచి తిరుపతికి ట్రైనింగ్ నిమిత్తం వెళ్లనున్నారు. వీరంతా పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకూ వివిధ దశల్లో పదోన్నతి పొందుతూ వచ్చారు. ఎస్సై పదోన్నతులు కోసం ఎదురు చూస్తున్న వీరికి డిపార్ట్‌మెంట్‌లో సర్వీస్ ఏడాది నుంచి ఐదేళ్ల లోపే ఉంది. పదోన్నతి పొందిన జిల్లా ఏఎస్సైలు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

అప్పుడే రాజకీయ పైరవీలు

జిల్లా ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి రావడం మంచి పరిణామమే. వాస్తవంగా పోలీసు నిబంధనల ప్రకారం ఎస్సైపై అధికారులంతా రేంజ్ పరిధిలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంది. సొంత జిల్లాలకు సాధ్యమైనంత వరకూ బదిలీ చేయరు. అయితే ఇప్పుడు పదోన్నతులతో త్వరలో ఎస్సైలయ్యే 22 మందిలో కొంత మంది ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులను కలసి తమను తిరిగి ఎస్సైలుగా సొంత జిల్లాలోనే నియమించేలా చేయాలని అప్పుడే పైరవీలతో ప్రయత్నాలు మొదలుపెట్టారు. ట్రైనింగ్ అనంతరం వారు తిరిగి ఈ జిల్లాకే వచ్చే ప్రయత్నాలు, పైరవీల పట్ల పోలీస్ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

లక్ష్మీనృసింహుని జన్మ నక్షత్ర పూజలు



అంతర్వేది ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలు చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహ స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా శుక్రవారం అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పి.రామశేషాచార్యులు ఈ పూజలు చేశారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి కలశాలతో పవిత్ర జలాలను తీసుకువచ్చారు. అనంతరం 108 కలశాలలో ఉంచిన జలాల్లోకి శ్రీస్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చనలు నిర్వహించారు. అనంతరం నారసింహ సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదాన పథకంలో భక్తులకు భోజన వసతి కల్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వర్గీకరణతో దళిత జాతి విచ్ఛిన్నం

రాక్స్ జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్



వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

అయినవిల్లి: ఎస్సీ వర్గీకరణతో దళిత జాతి విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉందని రాక్స్ జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. క్రాప గ్రామ ఆదర్శనగర్‌లో రాక్స్ జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జన సమీకరణ సమావేశం దుక్కిపాటి సత్యనారాయణ, గుర్రాల రాంబాబు అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రత్నాకర్ మాట్లాడుతూ దళితులు వందేళ్ల కిందట ఎలాగైతే బతికారో అలా బతికే రోజులు మళ్లీ వస్తాయన్నారు. మూతికి ముంత, మొలతాడుకు తాటాకు, మెడలో డోలు వేసుకుని తిరిగే ప్రమాదకరమైన రోజులు తిరిగి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇటువంటి విపత్తును మనం అడ్డుకోవాలని, దళితులపై రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఎస్సీ వర్గీకరణ ముసుగులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రద్దు చేసే యోచనలో అగ్రకుల రాజకీయ పార్టీలు ఉన్నాయన్నారు. అదే జరిగితే దళితులను ఊచకోత కోస్తారని ఆరోపించారు. ఈ పోరాటంలో తన ప్రాణం పోయినా లెక్క చేయనని, దళితులను అభివృద్ధి పథంలో నడిపించి రాజ్యాధికారం సాధించడమే లక్ష్యమన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగనివ్వనని, కేంద్రం మెడలు వంచి వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయిస్తానని అన్నారు. త్వరలో 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ పెట్టి కేంద్రంపై యుద్ధానికి సిద్ధం చేస్తానన్నారు. ఈ సమావేశంలో రాక్స్ స్టేట్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కీర్తి నారాయుడు, మాగం సర్పంచ్ కాశీ వీరవెంకట సత్యనారాయణ, దళిత నాయకులు బొక్కా రామచంద్రరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మెల్లం సత్యనారాయణ, పాస్టర్ సురేష్, పోతుల సుందరం తదితరులు పాల్గొన్నారు.

రికార్డుకు చేరువలో సత్యదేవుని వ్రతాలు

- 2022లో 1,42,378 వ్రతాలే
- ఇప్పటి వరకూ అత్యధికం
- శుక్రవారం నాటికి 1,40,423 నిర్వహణ

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయంలో ఈ ఏడాది కార్తిక మాసంలో రికార్డు స్థాయిలో వ్రతాలు జరగనున్నాయి. శుక్రవారం జరిగిన 3,807 వ్రతాలతో కలిపి ఇప్పటికి 1,40,423 వ్రతాలు జరిగాయి. 2022 కార్తికమాసంలో జరిగిన 1,42,378 వ్రతాలే ఇప్పటి వరకు రికార్డు. శనివారం జరిగే వ్రతాలతో ఆ రికార్డు అధిగమించే అవకాశం ఉంది. శని, ఆది వారాలు ఆరు వేల నుంచి పదివేల వ్రతాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కనీసం రెండు వేలు జరిగినా రికార్డు అధిగమించే అవకాశం ఉంది.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది

సత్యదేవుని దర్శనానికి శుక్రవారం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో రద్దీ ఏర్పడింది. తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రద్దీ కొనసాగింది. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా అన్ని విభాగాల ద్వారా రూ.50 లక్షల ఆదాయం సమకూరింది.

వైభవంగా సహస్ర జ్యోతిర్లింగార్చన

కార్తిక బహుళ త్రయోదశి సందర్భంగా రత్నగిరిపై సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామివారు, దేవేరులను ప్రధానాలయం నుంచి అనివేటి మండపానికి తీసుకువచ్చి అక్కడి వేదికపై ప్రతిష్ఠించారు. అనంతరం లింగాకారంలోని శివునికి పూజలు చేసి వేదాశీస్సులు అందచేశారు. అనంతరం శివలింగాకారంలో జ్యోతులను వెలిగించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, ఉప ప్రధాన అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, సుధీర్, దత్తాత్రేయ శర్మ, పవన్, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు తదితరులు పూజలు చేశారు.



అనివేటి మండపంలో సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ఇసుక కొరత రానీయొద్దు

- రోజుకు 20 వేల మెట్రిక్ టన్నులు సిద్ధం చేయాలి
- అధికారులకు కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో ప్రజలకు ఇసుక కొరత రాకుండా, రీచ్‌ల ద్వారా రోజుకు 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వేలా చూడాలని కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ అధ్యక్షుడు ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌ల వారీగా తవ్వకాలపై సమీక్షించారు. కపిలేశ్వరపురం, తాటిపూడి రీచ్‌ల్లో గోదావరి ప్రవాహం ఇంకా కొనసాగుతుందని రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల తెలిపారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే నిర్దేశిత ఆపరేటింగ్ ఏజెన్సీల ద్వారా ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. రోజూ ఒక్కో రీచ్ నుంచి 500 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. నార్కెడుమిల్లి, ఆలమూరు, పొడగట్లపల్లి రీచ్‌ల్లో డిసెంబర్ 1 నుంచి తవ్వకాలను ఆపరేటింగ్ ఏజెన్సీల ద్వారా చేయాలన్నారు. జేసీ టి.నిషాంతి, జిల్లా గనులు, భూగర్భ శాఖ ఏడీ ఎల్.వంశీధర్‌రెడ్డి, ఆర్డీఓలు కె.మాధవి, పి.శ్రీకర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకర్రావు పాల్గొన్నారు.

- జిల్లాలో సీ ప్లేన్స్ కార్యకలాపాల నిర్వహణకు అనువైన ప్రాంతాలపై నివేదిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ డెవలప్‌మెంట్‌లో భాగంగా సీ ప్లేన్స్‌కు అనువైన ప్రాంతాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. సముద్ర బ్యాక్ వాటర్ ఎల్లప్పుడూ ఉండేలా, నదీ ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఇవి సముద్ర తీరం, ఐ.పోలవరం, పాశర్లపూడి, యానాం పరిసరాల్లో ఎక్కువగా ఉంటాయన్నారు.

డీసీసీబీ ద్వారా రూ.13.16 కోట్ల రుణాలు

జిల్లాలో 19 చేనేత సహకార సంఘాలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా క్యాష్ క్రెడిట్ రుణాల మంజూరు కోరుతూ రూ.13.16 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు కమిటీ సభ్యుల అనుమతితో కలెక్టర్ మహేష్ కుమార్ ఆమోద ముద్ర వేశారు. జిల్లా స్థాయి చేనేత సహకార సంఘాల కమిటీ సమావేశంలో చేనేత సహకార సంఘాల అభివృద్ధికి రుణాల కల్పన, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం వంటి అంశాలపై సమీక్షించారు. చేనేత జౌళీ శాఖ సహాయ సంచాలకుడు కె.పెద్దిరాజు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణ, వీవర్స్ సర్వీసెస్ సంఘ విజయవాడ ప్రతినిధి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెల్త్ ఇన్సూరెన్స్

సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, చిల్డ్రన్ హెల్త్ కేర్ కేంద్రాల్లో చిన్నారులు, ఆశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న అనాథలు సుమారు 85 వేల మందికి ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయనున్నట్లు కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు వసతి గృహ సంక్షేమ అధికారులు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 84 వివిధ రకాల సంస్థలు ఉన్నాయని, వీటిలోని వారికి అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఐసీఐసీఐ లాంబార్డ్ ఆరోగ్య బీమా సేవలు అందుబాటులో తెచ్చామన్నారు. ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రతినిధి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ సందేహాల నివృత్తికి 1800 2666 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, బీసీ సంక్షేమ అధికారి ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ పి.జ్యోతిలక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఉమ్మడి.. ఆ పై హడావుడి

- క్రీడా సమాఖ్య పోటీల్లో వింత పోకడ
- ఉమ్మడి జిల్లాల వారీగా నిర్వహణతో క్రీడాకారులకు నష్టం


కాకినాడ జిల్లా స్థాయి ఎంపికలకు హాజరైన క్రీడాకారులు (ఫైల్)


డీఎస్ఏలో అండర్-19 విభాగం హాకీ పోటీల్లో తలపడుతున్న బాలికలు (ఫైల్)

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం. అలాంటి క్రీడల్లో వారిని ప్రోత్సహించేందుకు పాఠశాల క్రీడా సమాఖ్య ఏర్పాటైంది. దీని ద్వారా అండర్-14, 17, 19 విభాగాల్లో ఏటా మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఏటా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో డీఈఓలు, రాష్ట్ర స్థాయిలో పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు పోటీలు జరుగుతున్నాయి. ఇందులో పొందిన ధ్రువపత్రాలు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ పొందేందుకు ఉపయోగపడతాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా ఏర్పాటు చేసి పోటీలను ప్రతి జిల్లా వారీగా నిర్వహించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికలు 26 జిల్లాల ప్రకారం కాకుండా, పాత 13 జిల్లాల ప్రాతిపదికనే నిర్వహించడంతో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవకాశాలు చేజారాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, తైక్వాండో, స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, రోలర్ స్కేటింగ్, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, చెస్, జూడో, రగ్బీ, హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, లాన్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్ తదితర దాదాపు 40 క్రీడలు పాఠశాల క్రీడా సమాఖ్యలో ఉండగా.. రాష్ట్రంలో 34 క్రీడాంశాల వరకూ క్రీడాకారులను మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఈ ఏడాది ఎంపికలు నిర్వహించారు. అయితే జిల్లాలు విడిపోయిన తర్వాత డీఈఓలు, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శులను వేర్వేరుగా ఏర్పాటు చేసి ఎంపికలు మాత్రం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే నిర్వహించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సూచించారు. దీంతో పాఠశాల విద్యాశాఖ సమాఖ్య ఎంపికలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే నిర్వహించాలని నిర్ణయించి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఎంపికలు ప్రారంభం కావడం అప్పటికే జాతీయ స్థాయి పోటీల షెడ్యూల్ విడుదల కావడంతో ఎంపికలు ఒకింత హడావుడిగానే జరిగాయని వ్యాయామ ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. 26 జిల్లాల ప్రాతిపదికన నిర్వహిస్తే ఎక్కువ మంది క్రీడాకారులకు అవకాశం వచ్చేదని, ఉమ్మడి ప్రాతిపదికన నిర్వహించడం వల్ల చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఏడాది అవకాశాలు చేజారాయని క్రీడాకారుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పోటీల నిర్వహణకు నిధులు ఇలా..

ఈ ఏడాది పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికలు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు సమగ్ర శిక్ష నుంచి నిధులు కేటాయించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు ముందుగా 50 శాతం నిధులు అడ్వాన్స్‌గా అందించారు. మండల, నియోజకవర్గ స్థాయిల్లో ఎంపికల నిర్వహణకు రూ.5 వేలు, జిల్లా స్థాయి ఎంపికలకు రూ.1.35 లక్షలు, రాష్ట్ర స్థాయి ఎంపికలకు ఒక్కొక్క క్రీడాకారుడు, కోచ్, మేనేజర్లు, టెక్నికల్ సిబ్బందికి భోజనానికి రోజుకు రూ.150, ప్రారంభ, ముగింపు ఖర్చుల నిమిత్తం ఒక్కో క్రీడాకారుడికి రూ.60 అందిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు రూ.350 క్రీడా దుస్తుల నిమిత్తం ఇస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల రవాణా ఖర్చులకు రూ.8.30 లక్షల నిధులు ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించారు. అయితే ఈ ఏడాది అండర్-14, 17 విభాగాల్లో మాత్రమే రవాణా ఖర్చులు అందిస్తున్నారు. అండర్-19 విభాగంలో రవాణా ఖర్చులు అందించడం లేదనే వాదన వినిపిస్తోంది.

క్రీడాకారులకు నష్టం

ఈ ఏడాది ఉమ్మడి ప్రాతిపదికన ఎంపికలు **నిర్వహించడంతో** వ్యక్తిగత, బృంద విభాగం **లో ఎక్కువ మందికి** అవకాశాలు రాలేదు. అం**డర్-14, 17, 19** బాలురు, బాలికలకు వేర్వే**రుగా హ్యాండ్‌బాల్**, ఖోఖో, కబడ్డీ, బాల్ **బ్యాడ్మింటన్‌లో** ఒక్కో విభాగంలో 12 మం**దిని, చెస్, లాన్‌టెన్నిస్‌**లో 5 మందిని, హాకీలో **18 మందిని, సాఫ్ట్‌బాల్**లో 16 మందిని జిల్లా, **రాష్ట్ర, జాతీయ స్థా**యికి ఎంపిక చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఇది వర్తిస్తుంది. అదే తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల వారీగా నిర్వహిస్తే ఈ ఎంపికల్లో మరింత మందికి అవకాశం వచ్చేది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చాలామంది క్రీడాకారులకు మొండి చేయి ఎదురైంది.

జోన్ల వారీగా నిర్వహిస్తే మంచిది

పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికల్లో రాష్ట్ర స్థాయిలో 26 జిల్లాల ప్రాతిపదికన నిర్వహించడానికి సరిపడా వసతి సౌకర్యాలు, క్రీడా మౌలిక సదుపాయాలు, నిధులు లేకపోవడంతో నిర్వాహకులు పోటీల నిర్వహణకు ఈ ఏడాది ముందుకు రాలేదు. దీంతో ఉమ్మడి ప్రాతిపదికన నిర్వహించడంతో ఎక్కువ మంది క్రీడాకారులు నష్టపోతున్నారని, 26 జిల్లాలను జోన్ల వారీగా విభజించి జోనల్ స్థాయిలో విజేతలుగా వచ్చిన జట్లకు మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తే పోటీల నిర్వహణ అనువుగా ఉంటుందని క్రీడాసంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు తమ అభిప్రాయాన్ని చెబుతున్నారు.

క్లుప్తంగా

తండ్రి చెంతకు మతిస్థిమితం లేని యువకుడు


రిపన్‌ను తండ్రికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

తుని: మతిస్థిమితం లేని యువకుడిని అతని తండ్రికి అప్పగించినట్లు స్థానిక రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. ఆ వివరాల్లోకెళితే.. ఈ నెల 27న చెన్నై- హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన మతిస్థిమితం లేని యువకుడు షేక్ రిపన్ (25) లోదుస్తులతో తిరుగుతూ తుని రైల్వే స్టేషన్లో దిగాడు. స్టేషన్ మాస్టర్ రూమ్‌లోకి ప్రవేశించి ఇబ్బంది పెట్టడంతో ఆయన రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు ఆదేశాలతో సిబ్బంది రిపన్‌ను రైల్వే పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. అతను పశ్చిమ బెంగాల్ మురారి గ్రామానికి చెందిన వాడిగా గుర్తించి ఫోన్లో తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. రైల్వే పోలీసులు శుక్రవారం రిపన్‌ను అతని తండ్రి షేక్ నజీముద్దిన్‌కు అప్పగించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు, రుణదాతకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ చెందిన సలాది సూరిబాబు వద్ద సర్పవరానికి చెందిన జుత్తుక వెంకట నరేష్ 2020లో రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2023లో రూ.5 లక్షల చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును సూరిబాబు బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. ఈ విచారణలో వెంకట నరేష్ నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.5 లక్షలు ఇవ్వాలని తీర్పు చెప్పారు.

చెరువులో స్నానానికి దిగి విద్యార్థి మృతి

నల్లజర్ల: స్థానిక హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ సమీపంలో ఉన్న పేరంటాల గుంట చెరువులో స్నానానికి వెళ్లిన ఓ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో నల్లజర్ల జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థి గుడిశే జ్యోతిప్రకాష్ (15), జంపల్లి రాజేష్ (పదో తరగతి), ములపర్తి హేమంత్‌కుమార్ (7వ తరగతి), ములపర్తి లక్ష్మీనారాయణ (7వ తరగతి), తాడే యువరాజు (9వ తరగతి) స్కూల్ మానేసి స్నానానికి వెళ్లారు. ఈత నేర్చుకోవడానికి చెరువులో దిగిన జ్యోతిప్రకాష్ నీట మునిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతన్ని నల్లజర్ల పీహెచ్‌సీకి తీసుకెళ్లగా, అప్పటికే ఆ విద్యార్థి మృతి చెందినట్లు డాక్టరు ధ్రువీకరించారు. తల్లిదండ్రులు పోలీసు కేసు వద్దని జ్యోతిప్రకాష్ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ టోర్నీ


అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో అండర్-17 అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ఐ సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం రెండోరోజు ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లను ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి ప్రారంభించారు. మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో తూర్పుగోదావరి జట్టు అనంతపురంపై 8-4, శ్రీకాకుళం జట్టు నెల్లూరుపై 11-6 స్కోర్‌తో, విజయనగరం జట్టు గుంటూరుపై 3-1, కడప జట్టు ప్రకాశంపై 10-2 స్కోర్‌తో గెలిచి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ మ్యాచ్‌లను టోర్నమెంట్ పరిశీలకుడు కె.ఈశ్వరరావు, ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురామ్ పర్యవేక్షించారు.

గోదావరి పాయలో మొసలి


ములకల్లంక శివారు గోదావరి పాయ ఒడ్డున మొసలి

సీతానగరం: మండలంలోని ములకల్లంక శివారున గోదావరి పాయలో మొసలి కనిపించడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ములకల్లంక గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఉత్తరం వైపున గోదావరి నీరు కొలనుగా ఏర్పడింది. అందులో మొసలి ఒడ్డుకు వచ్చి ఉండటం పశువుల కాపరి చూసి ఫొటో తీశాడు. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో అటవీ శాఖాధికారులు మొసలి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. దీనిపై అటవీ శాఖ బీట్ ఆఫీసర్ రంగారావు విలేకరులతో మాట్లాడుతూ ఫొటోలో ఉన్న లొకేషన్‌లో పరిశీలించామన్నారు. ఇక్కడ గోదావరి వరద అనంతరం కొలనుగా ఏర్పడిందన్నారు. మొసలి విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టిలో ఉంచామన్నారు. వారి సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాల్యం నుంచే ఆధ్యాత్మిక చింతన అవసరం

శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి


శ్రీదత్తాత్రేయ వేదవిద్యా గురుకులంలో విద్యార్థులకు ఆశీస్సులు అందజేస్తున్న శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బాల్యం నుంచే పిల్లలకు ఆధ్యాత్మిక చింతన అలవర్చాలని శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ మహాస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక విరించి వాన ప్రస్థాశ్రమంలో పిల్లల అంధత్వ నివారణ కోసం మహా పాశుపత రుద్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మనకున్న కొద్ది సమయంలో భగవంతుని చింతనలో గడపాలన్నారు. వ్యర్థమైన విషయాలను వదిలి పెట్టాలని సూచించారు. పూజ గదిలో భగవంతుని ఎదురుగా కూర్చున్నప్పుడు మనస్సు ఆ దైవంపైనే ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ భగవత్ చింతనకు కొంత సమయం కేటాయించుకోవాలని, ఆ సమయంలో ప్రళయం వచ్చినా భగవంతుడే పరిష్కారం చూపుతాడని నమ్మకం కలిగి ఉండాలన్నారు. ఆడిటర్ భాస్కర రామ్, విరించి వానప్రస్థాశ్రమం ట్రస్టీలు, ఆశ్రమ వాసులు హాజరయ్యారు.

వేద విద్య గురుకులం సందర్శన

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని శ్రీదత్తాత్రేయ వేదవిద్యా గురుకులాన్ని శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి సందర్శించారు. గురుకులం నిర్వాహకుడు, స్వాధ్యాయ రత్న గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి, ఇతర అధ్యాపకులు విధుశేఖర భారతీ స్వామికి సాదరంగా స్వాగతం పలికారు. గురుకులం తరఫున స్వాగత పత్రాన్ని భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు, సీతారామచంద్ర ఘనపాఠీలు సమర్పించారు. పావన కార్తికమాస శివరాత్రి పర్వదినాన జగద్గురువులు గురుకులాన్ని సందర్శించడం తమ అనుష్ఠాన భాగ్యవిశేషమని సీతారామచంద్ర ఘనపాఠి అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు సంప్రదాయ పద్ధతిలో వేద విద్యను నేర్పుతున్న నిర్వాహకులకు విధుశేఖర భారతీస్వామి ఆశీస్సులు అందజేశారు. శృంగేరీ పీఠం తరఫున రూ.రెండు లక్షల విరాళాన్ని గురుకులానికి ఆయన ఇచ్చారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం శృంగేరీ శారదా శంకర మఠం ధర్మాధికారి వేలూరి వెంకటరామయ్య, పలువురు వేదపండితులు, వేద శాస్త్రాభిమానులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

- తలపడిన పలు జిల్లాల జట్లు
- సాయంత్రం వర్షంతో అంతరాయం


అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో క్రికెట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

అమలాపురం టౌన్: అమలాపురంలో ఏకకాలంలో మూడు క్రీడా మైదానాల్లో అంతర్ జిల్లాల బాలుర అండర్- 14 క్రికెట్ పోటీలు రెండో రోజు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రాష్ట్ర స్థాయి లీగ్ కమ్ నాక్ అవుట్ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన జట్లు తలపడుతున్నాయి. అయితే బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శుక్రవారం సాయంత్రం నుంచి కురిసిన వర్షంతో మ్యాచ్‌ల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది. క్వార్టర్స్ ఫైనల్‌కు వచ్చిన జట్లు తలపడేందుకు సిద్ధమవుతున్న సమయంలో అప్పటికే ఈదురు గాలులతో వర్షం పడింది. క్వార్టర్ ఫైనల్స్‌ను మూడో రోజు శనివారం నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట రవి తెలిపారు. అమలాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, బాలయోగి స్టేడియం, కిమ్స్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 250 మంది క్రీడాకారులతోపాటు పోటీలను వీక్షించేందుకు వచ్చిన క్రీడాభిమానులతో ఆ మైదానాల్లో సందడి కనిపించింది. బాలయోగి స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను డీఈఓ షేక్ సలీమ్ బాషా తిలకించారు. భోజనాలు, ఇతర వసతి ఏర్పాట్లపై క్రీడాకారులను డీఈఓ ఆరా తీశారు. జిల్లా ఏఎస్పీ ప్రసాద్ కూడా బాలయోగి స్టేడియంలో మ్యాచ్‌లను చూశారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఏవీ శ్రీనివాస్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి బీవీఎస్ మూర్తి, బాలయోగి స్టేడియం ఇన్‌చార్జి, ఫిజికల్ డైరెక్టర్ పాయసం శ్రీనివాసరావు, మరో ఫిజికల్ డైరెక్టర్ కామన మధుసూదనరావుతో పాటు జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు మ్యాచ్‌లకు రిఫరీలుగా వ్యవహరిస్తున్నారు.

రెండో రోజు శుక్రవారం లీగ్ మ్యాచ్‌లలో భాగంగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో మూడు మ్యాచ్‌లు జరిగాయి. తొలుత గుంటూరు జిల్లా, కడప జిల్లా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోటీల్లో కడప జిల్లా 4 వికెట్లతో తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌గా తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లాల జట్లు తలపడ్డాయి. 9 వికెట్ల తేడాతో శ్రీకాకుళం విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్ శ్రీకాకుళం, కడప జిల్లాల జట్ల మధ్య జరిగింది. కేవలం ఒక పరుగు తేడాతో కడప విజయం సాధించింది. బాలయోగి స్టేడియంలో తొలుత కర్నూలు, కృష్ణా జిల్లాల జట్ల మధ్య పోటీ జరిగింది. ఆరు వికెట్ల తేడాతో కృష్ణా జిల్లా విజయకేతనం ఎగుర వేసింది. తర్వాత అనంతపురం, నెల్లూరు జిల్లాల మధ్య మ్యాచ్ జరిగింది. 26 పరుగుల తేడాతో అనంతపురం విజయం సాధించింది. మూడో మ్యాచ్ కర్నూలు, విజయనగరం జిల్లాల మధ్య జరిగింది. 10 వికెట్ల తేడాతో కర్నూలు గెలిచింది. అలాగే కిమ్స్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో తొలి మ్యాచ్ విశాఖపట్నం, ప్రకాశం జిల్లాల జట్ల మధ్య జరిగింది. కేవలం ఒకే ఒక పరుగుతో విశాఖపట్నం గెలిచింది. తర్వాత గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల మధ్య పోటీలో 10 వికెట్ల తేడాతో తూర్పుగోదావరి జిల్లా విజయం సాధించింది. మూడో మ్యాచ్ చిత్తూరు, విశాఖపట్నం జిల్లాల జట్ల మధ్య జరిగింది. 8 వికెట్ల తేడాతో చిత్తూరు జిల్లా జట్టు గెలిచింది.

సృజనాత్మకత వెలికితీసేందుకు తోడ్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న రోషన్ శ్రీవాత్సవ్

రాజానగరం: గ్రామీణ విద్యార్థుల్లో సృజనాత్మకత మరింత పెంపొందించేందుకు తమ సంస్థ తోడ్పాటు అందిస్తుందని తిరుపతిలోని ఐఐటీకి చెందిన టెక్నాలజీ ఇంక్రిబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్ అన్నారు. గోదావరి గ్లోబెల్ యూనివర్సిటీ (జీజీయూ)లో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగే ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ) బూట్ క్యాంప్ శుక్రవారం ప్రారంభమైంది. జీజీయూతో తమ సంస్థ చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఇక్కడ త్వరలోనే జీఐఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చేయూత ఇస్తామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ కష్టించి పనిచేస్తే ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగవచ్చన్నారు. మరో ముఖ్యఅతిథి, ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ మేనేజర్ డాక్టర్ ఐఎస్ భీమలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను బాల్యదశలోనే గుర్తించి, తగిన ప్రోత్సాహాన్ని అందించేలా ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జీజీయూ వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, బూట్ క్యాంప్ నోడల్ అధికారి టి.జయానందకుమార్, వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విశాల్ నాయర్, జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, మోడల్ అధికారులు డి.విజయేంద్రకుమార్, కె.వినోద్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో: ఆరుగురికి గాయాలు


108లో బాధితులను తరలిస్తున్న సిబ్బంది


ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేట సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ వివరాల ప్రకారం.. చిన్నింపేటలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొని పెద్దనాపల్లి గ్రామానికి చెందిన 13 మంది ఆటోలో ఇంటికి బయలుదేరారు. చిన్నింపేట సమీపంలోని సీపీఎఫ్ కంపెనీ వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కుప్పల దేవి, కీర్తి రత్నకుమారి, కీర్తి నాగమణి, బుద్దా రాణి, శరకణం భూలక్ష్మీ, శరకణం జగవేణికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో ప్రత్తిపాడులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

పిఠాపురం: స్థానిక మినీ స్టేడియంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 85 మంది హాజరయ్యారు. ఇందులో 30 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబర్ 3 నుంచి 5 వరకూ విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ ఆర్చరీ పోటీల్లో వారు పాల్గొంటారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలకృష్ణ, కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు. విజేతలను మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు అభినందించారు.

ప్రమాదంలో వైద్య విద్యార్థికి తీవ్ర గాయాలు


ఫణికుమార్ పృథ్వీ (ఫైల్)


శివకోడు బైపాస్ రోడ్డులో ప్రమాదానికి గురైన వైద్య విద్యార్థి పృథ్వీ

రాజోలు: శివకోడు బైపాస్ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల విద్యార్థి మండెల శ్రీనివాస ఫణికుమార్ పృథ్వీ తీవ్రంగా గాయపడ్డాడు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన పృథ్వీ అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో రెండో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అమలాపురంలో కళాశాలకు పాలకొల్లు నుంచి మోటార్ సైకిల్‌పై శుక్రవారం బయలు దేరాడు. శివకోడు చిన్నోడు మద్యం దుకాణం సమీపంలో మట్టపర్రు వెళ్లేందుకు స్థానిక నారాయణ స్కూల్ బస్సు హైవే బైపాస్ రోడ్డును క్రాస్ చేస్తుండగా మోటార్ సైకిల్ ఢీకొని పృథ్వీ తలకు తీవ్ర గాయమైంది. దీంతో స్థానికులు అతన్ని 108 అంబులెన్స్‌లో రాజోలు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. విద్యార్థి వద్ద ఉన్న గుర్తింపు కార్డుతో అమలాపురం కిమ్స్ ఆస్పత్రి, పాలకొల్లులో ఉన్న కుటుంబ సభ్యులకు రాజోలు ఆస్పత్రి వర్గాలు సమాచారం ఇచ్చాయి. తీవ్రంగా గాయపడిన విద్యార్థికి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజోలు నుంచి అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. రాజోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.